
సాక్షి బాపట్ల
మంగళవారం | 7 | జనవరి | 2025





## దివ్యాంగుల పింఛన్ల తనిఖీ

కారెంపూడి: దివ్యాంగుల పింఛన్ల పరిశీలనా బృందం సోమవారం తనిఖీలు చేసింది. మండలంలో 41 మంది ఇళ్లకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి సేకరించారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 567.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,500 క్యూసెక్కులు వదిలారు.



## హరినామ సంకీర్తన గానం

తెనాలి: పట్టణంలోని శ్రీరుక్మిణి సమేత గోవర్ధన స్వామి దేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం శ్రీహరినామ సంకీర్తన బృందంచే సంకీర్తనగానం జరిగింది.

# పర్చూరులో పెనువిషాదం

### అగ్ని ప్రమాదంలో అక్కాచెల్లెళ్లు మృతి

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం
- నిద్రలోనే మృత్యు ఒడికి
- ఇద్దరూ అనారోగ్యంతో బాధపడుతున్న వైనం
- సకాలంలో స్పందించని ఫైర్ సిబ్బంది
- ఘటన జరిగిన రెండు గంటల తర్వాత చేరుకున్న వైనం
- అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిన వైనం

కళ్లముందు అగ్ని కీలలు చుట్టుముడుతున్నా.. మృత్యువు అగ్నిరూపంలో దూసుకొస్తున్నా.. మంచంపై నుంచి లేచి తప్పించుకోలేని నిస్సహాయ స్థితిలో ఆ అక్కాచెల్లెళ్లు పెట్టిన కేకలు అరణ్యరోదనగా మారాయి. చూస్తుండగానే నిమిషాల వ్యవధిలోనే ఇద్దరు అభాగ్యులు అగ్నికి ఆహుతి అవడం.. కళ్లముందే తన గారాల పట్టీలు కాలిపోతుండడం చూడలేక వారిని కాపాడే ప్రయత్నంలో మాతృమూర్తి సైతం తీవ్రంగా గాయపడడం.. చూపరులను కలిచివేసింది. మరణంలోనూ వీడని రక్త సంబంధంగా అచేతనంగా పడి ఉన్న ఆ అక్కాచెల్లెళ్లను చూసి కంటనీరు పెట్టని వారు కానరాలేదు.. ద్రవించని హృదయమే గోచరం కాలేదు. హృదయాలను పిండేసే ఈ విషాద ఘటన పర్చూరులో కలకలం రేపింది.



తీవ్ర గాయాలపాలైన తల్లి లక్ష్మీరాజ్యం

పర్చూరు (చినగంజాం): ఊహించని ప్రమాదం ఆ కుటుంబంలో పెనువిషాదం నింపింది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అక్కాచెల్లెళ్ల ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనతో నియోజకవర్గ కేంద్రం పర్చూరు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళితే.. పర్చూరు గ్రామంలోని రామాలయం వీధిలో దాసరి వెంకటేశ్వర్లుకు చెందిన రేకుల షెడ్డు ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పురవ్వలు చెలరేగి ఇంట్లోని దుస్తులు, వస్తువులకు, గ్యాస్ సిలిండర్‌కు నిప్పంటుకొని సోమవారం అర్ధరాత్రి గం.1.30 సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఊహించని ఘటనతో అనారోగ్యంతో ఉన్న ఇద్దరు ఆడబిడ్డలు దాసరి నాగమణి (34), దాసరి మాధవీలత (23) మంటల్లో కాలి మృతిచెందడం, వారిని రక్షించుకునే ప్రయత్నంలో తల్లి లక్ష్మీరాజ్యం తీవ్ర గాయాలపాలై ఆస్పత్రి పాలవడం పర్చూరు వాసులను కంటతడి పెట్టించింది. నాగమణి పక్షవాతంతో మంచానికే పరిమితమవగా, మాధవీలత ఫిట్స్ వ్యాధితో బాధపడుతోంది. ఇద్దరు అక్కాచెల్లెళ్లను అర్ధరాత్రి మృత్యువు కబళించడాన్ని తలుచుకొని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేస్తూ ప్రమాద ఘటన తెలిసి ఇంటికి చేరుకున్న తండ్రి వెంకటేశ్వర్లు గుండెలవిసేలా విలపించడం చూపరులను కలచివేసింది.



ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

### ఘటనా స్థలాన్ని సందర్శించిన చీరాల డీఎస్పీ..

ఘటనా ప్రాంతాన్ని చీరాల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడం, విద్యుత్ మీటరు కన్పించకుండా ఉండటంతో ఆయన విద్యుత్‌శాఖ ఏడీఈ రమేష్‌ని పిలిపించి పరిశీలించాలని, పూర్తి విచారణ చేయాల్సిందిగా కోరారు. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా.. లేక దోమల కాయిల్ వలన నిప్పంటుకొని ప్రమాదం సంభవించిందా అనేది క్లూస్ టీంని రప్పించి విచారణ చేయాల్సిందిగా ఆయన సూచించారు. ఆయన వెంట పర్చూరు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ డి.రత్నకుమారి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

### నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణాలు బలి

ఆదివారం అర్ధరాత్రి 1.15 నిమిషాల నుంచి 1.30 నిమిషాల్లోపు మంటలు చెలరేగాయి. ఆ సమయంలో చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించారు. దాదాపు 45 నిమిషాల పాటు వారు కనీసం ఫోన్ కూడా ఎత్తే పరిస్థితిలో లేరని తెలిసింది. అటు తరువాత సమాచారం అందుకున్న సిబ్బంది వేకువజామున 3.25 నిమిషాలకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ లోపులోనే ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్లకు నిప్పు అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మంటలు ఉవ్వెత్తున లేవడంతో అగ్నికి ఆహుతవుతున్న మహిళలను కాపాడే సాహసాన్ని స్థానికులు చేయలేకపోయారు. స్థానికంగా నీటిని తెచ్చి పోసే ప్రయత్నం జరిగినా అవి సరిపోలేదు. అర్ధరాత్రి కావడంతో అక్కడికి ప్రజలు ఒకరిద్దరు మినహా ఎక్కువ మంది రాలేకపోయారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి ఉంటే ఇద్దరిలో ఒకరినైనా కాపాడుకొనే వారమని స్థానికులు చెబుతున్నారు.

## ఆర్మీ గ్రోసరీ విక్రయాలపై సీబీఐ విచారణ?

- కాంట్రాక్ట్ ఉద్యోగిని అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు!
- బాపట్ల, గుంటూరు పరిధిలోని ఆర్మీ క్యాంటీన్ల నిర్వహణపై పరిశీలన

బాపట్ల: ఆర్మీలో పనిచేసే ఉద్యోగులకు అందించే గ్రోసరీ విక్రయాలు పక్కదారి పట్టడంపై సీబీఐ విచారణ చేపట్టినట్లు తెలిసింది. బాపట్ల ఎయిర్‌ఫోర్స్, గుంటూరు ఆర్మీ క్యాంటీన్లలోని గ్రోసరీ పక్కదారి పడుతోందనే ఫిర్యాదుల మేరకు విజయవాడకు చెందిన సీబీఐ అధికారులు రహస్య విచారణ చేపట్టినట్లు ఆయా వర్గాలు తెలిపాయి. క్యాంటీన్లలో వివిధ రకాల వస్తువులను వివిధ వ్యక్తుల పేర్లతో తక్కువ ధరకు కొనుగోలు చేసి బయట మార్కెట్‌లో విక్రయాలు చేసి సొమ్ముచేసుకుంటున్నారనే ఫిర్యాదులపై సీబీఐ అధికారులు ఆదివారం విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ తతంగంలో కల్నల్‌స్థాయి ఉద్యోగి పాత్ర కూడా ఉన్నట్లు భోగట్టా. ఈమేరకు పెద్ద మొత్తంలో గ్రోసరీ కావాలని సీబీఐ ఉద్యోగులు ఓ కాంట్రాక్టు ఉద్యోగిని నమ్మించి అతని వద్ద నుంచి గ్రోసరీ తీసుకునేందుకు బాపట్ల సమీపంలోని భర్తీపూడికి రావాల్సిందిగా సూచించి అక్కడ అతనిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు గ్రోసరీ సంబంధించి పూర్తి విచారణ చేపట్టిన తరువాత వివరాలు వెల్లడించే అవకాశం ఉందని క్యాంటీన్‌కు సంబంధించిన ఉద్యోగి ఒకరు తెలిపారు.

## సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో సంక్రాంతికి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ సోమవారం తెలిపారు. కాచిగూడ–శ్రీకాకుళం రోడ్డు (07615) ప్రత్యేక రైలును ఈనెల 11, 15 తేదీలలో నడపనున్నట్టు వెల్లడించారు. శ్రీకాకుళం రోడ్డు–కాచిగూడ(07616)ఈనెల 12, 16 తేదీలలో ప్రత్యేక రైలును నడపనున్నట్టుపేర్కొన్నారు. చర్లపల్లి–శ్రీకాకుళం రోడ్డు(07617) ఈనెల 8న, శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి(07618) ఈనెల 9న ప్రత్యేక రైళ్లు నడుస్తాయని డీసీఎం వివరించారు. ఈ రైళ్లు డివిజన్ మీదుగా ప్రయాణిస్తాయని పేర్కొన్నారు.

## న్యూస్‌రీల్

### న్యాయమూర్తులకు శిక్షణా తరగతులు



నగరంపాలెం: న్యాయమూర్తులు మధ్యవర్తిత్వంపై నైపుణ్యాన్ని పెంపొందించుకుని సుప్రీంకోర్టుకు అనుగుణంగా మధ్యవర్తిత్వంలో భాగస్వాములు కావాలని సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటి నుంచి హాజరైన అడ్వకేట్ ప్రమీల ఆచార్య (రాజస్థాన్), అడ్వకేట్ వి.పి.తంకచన్ (కేరళ) అన్నారు. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటి (న్యూఢిల్లీ) ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో రాష్ట్ర హైకోర్టు ఎంపిక చేసిన న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై నలభై గంటల శిక్షణా తరగతులు జిల్లా పోలీస్ కార్యాయల ఆవరణలోని హాల్‌లో ప్రారంభమయ్యాయి. గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్ధసారథి, జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి మాట్లాడారు. మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందాక న్యాయమూర్తులు మధ్యవర్తులుగా ప్రత్యేక పాత్ర పోషిస్తారని వక్తలు అన్నారు. శిక్షణా కార్యక్రమంలో గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని సివిల్ జడ్జిలు (జూనియర్, సీనియర్ డివిజన్), జిల్లా జడ్జిలు, అధికారులు పాల్గొన్నారు.

### దేహదారుఢ్య పరీక్షల్లో 159 మంది అర్హత



నగరంపాలెం: స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో మహిళా కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సోమవారం జరిగాయి. 331 మంది మహిళా అభ్యర్థులు హాజరవ్వగా, 43 మంది సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కాకపోవడంతో వెనుదిరిగారు. మిగతా 288 మందికి శరీర కొలత పరీక్షలు నిర్వహించగా, అందులో 14 మంది బరువు, ఎత్తు కొలతలు సరిలేకపోవడంతో తిరస్కరించారు. మిగతా 274 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించగా, 105 మంది అర్హతను కోల్పోగా, 169 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. 169 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీలు చేపట్టగా 21 మంది అర్హత సాధించగా, 148 మంది అర్హత సాధించలేకపోయారు. 169 మందికి లాంగ్ జంప్ పోటీలు జరగ్గా, 159 మంది అర్హత సాధించగా 10 మంది అనర్హత పొందారు. 288 మంది మహిళా కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా, 159 మంది అర్హత సాధించగా, మరో 129 మంది అర్హత కోల్పోయారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఏఎస్పీలు (క్రైం) కె.సుప్రజ, ఎ.హనుమంతు (ఏఆర్) పర్యవేక్షించారు.

### సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



ఎం.రవికాంత్

పట్నంబజారు: సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. సోమవారం బస్టాండ్‌లోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాపరిధిలోని ఐదు డిపోలకు సంబంధించి ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు సాధారణ చార్జీలతో స్పెషల్ సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి గుంటూరుకు 103, తెనాలికి 11, మంగళగిరి 12, పొన్నూరు 17 బస్సు సర్వీసులను ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు నడుపుతారని, 15 నుండి 19వ తేదీ వరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు సంబంధించి ప్రయాణికుల రద్దీని బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 9 నుంచి 13వ తేదీ వరకు బెంగళూరు నుంచి మూడు, చెన్నై నుంచి ఆరు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు.

### ప్రభుత్వ ఉద్యోగం సామాజిక బాధ్యత

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగమంటే కేవలం ఉపాధి మాత్రమే కాదని, ఇదొక సామాజిక బాధ్యతగా గుర్తించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి ఆమె 11 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులనందించారు.

# అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలో ఉద్యోగుల కుటుంబ సభ్యులు హౌస్ హోల్డ్ డేటాలో ఇంకా 1888 మంది నమోదు కాలేదన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ, పోలీస్ శాఖ, ప్రజారోగ్యశాఖలో 1200 మంది సభ్యులు నమోదు కాలేదన్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు డేటాలో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం క్రింద ఇప్పటివరకు రూ.46 కోట్లు విలువచేసే పనులు మాత్రమే జరిగాయని పనులు వేగవంతం

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

చేసి సంక్రాంతి నాటికి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పెన్షన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలతోపాటు నగదు పురస్కారాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఆదేవిధంగా నెల్లూరులో జరిగిన క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లాకు చెందిన బధిరుల బృందాన్ని కలెక్టర్ అభినందించారు. జేసీ ప్రఖర్ జైన్, డీఆర్‌ఓ జి.గంగాధర్ గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి విల్లేమ్స్, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ పద్మజ, డీఎంహెచ్‌ఓ విజయమ్మ, డీపీఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

# కూటమిలో గ్రానైట్ ఫైట్

- కూటమి ప్రభుత్వంలో భారీగా జరుగుతున్న గ్రానైట్ అక్రమ రవాణా
- ప్రకాశం జిల్లా కీలక ప్రజాప్రతినిధి, పల్నాడు సీనియర్ నేత ఆధ్వర్యంలో దందా
- ప్రాధాన్యత ఇవ్వలేదంటున్న ఇతర ప్రజాప్రతినిధులు
- ముడుపుల పంపకంలో కూటమి ప్రజాప్రతినిధుల మధ్య కోల్డ్‌వార్
- అక్రమ రవాణాపై రాష్ట్ర జీఎస్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఓ వర్గం
- బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో శనివారం 14 గ్రానైట్ లారీలకు ఫైన్ వేసిన అధికారులు
- మార్టూరు సిండికేట్‌కు వ్యతిరేకంగా రోడ్డెక్కిన కూటమి నేతల పోరు

సాక్షి, నరసరావుపేట: మూడు నకిలీ వే బిల్లులు, ఆరు చెక్‌పోస్టులుగా సాగుతున్న గ్రానైట్ అక్రమ రవాణా కాస్తా కూటమి నేతల లుకలుకలతో రోడ్డునపడింది. ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్రాలకు నిత్యం వందల లారీలు ఆంధ్ర బార్డర్ దాటుతున్నాయి. పోలీసులు, రవాణాశాఖ, మైనింగ్, జీఎస్టీ అధికారులకు భయపడకుండా, పగలు రాత్రీ అని తేడా లేకుండా జీరో బిల్లులతో గ్రానైట్ పక్క రాష్ట్రాలకు తరలింది. యథేచ్ఛగా సాగుతున్న గ్రానైట్ మాఫియాపై గత శనివారం పలు ప్రాంతాల్లో మూకుమ్మడిగా జీఎస్టీ అధికారులు దాడులు చేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎప్పుడు లేనివిధంగా ఏకంగా ఆరు ప్రత్యేక టీంలుగా ఏర్పడ్డాయి. నరసరావుపేట, నకరికల్లు, కొండమోడు, బాపట్ల జిల్లా మార్టురు, సంతమాగులూరు, బల్లికురవ ప్రాంతాల్లో దాడులు చేసి 14 లారీలను పట్టుకొని రూ.25 లక్షల దాకా జరిమానా విధించారు. అయితే, ఒక్కసారిగా ఇంత పెద్ద మొత్తంలో దాడులు చేయడంపై జిల్లాలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. గ్రానైట్ దందాలో వర్గపోరుతోనే ఈ దాడులు జరిగాయనే ప్రచారం నడుస్తోంది.

### మార్టూరు సిండికేట్‌కు వ్యతిరేకంగా...

బాపట్ల జిల్లాకు చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో ఈ గ్రానైట్ అక్రమ రవాణా వ్యవహారం జరుగుతోందన్న విషయం అందరికీ తెలిసిందే. ఆయనకు వ్యక్తిగత సహాయకుడిగా ఉన్న వ్యక్తి గ్రానైట్ సిండికేట్‌ను నిర్వహిస్తున్నారు. టోకెన్ అమ్మే దగ్గర నుంచి ఈ–వే బిల్లు, జిల్లా దాటించడం, తెలంగాణలో డబ్బుల పంపిణీ వరకు మొత్తం అతనే చూస్తున్నాడు. రూ.14 వేల టోకెన్‌ను ఏకంగా రూ.30 వేలు వసూల్ చేసి దందాకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ముట్టజెపుతున్నాడు. బాపట్ల జిల్లాలో ఓ కీలక ప్రజాప్రతినిధికి , పల్నాడులో ఓ సీనియర్ ఎమ్మెల్యేకు నెలవారీ మామూళ్లు చేరుతున్నాయి. ఈ క్రమంలో పల్నాడులో గ్రానైట్ అక్రమ రవాణా జరిగే ప్రాంతాల ప్రజాప్రతినిధులకు మార్టూరు గ్రానైట్ సిండికేట్ నుంచి వాటా రావడంలేదని వారిలో అసంతృప్తి నెలకొందని సమాచారం. దీంతో కూటమి నేతల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందట. ఈ నేపథ్యంలో అసంతృప్తిలో ఉన్న ప్రజాప్రతినిధులు అక్రమ రవాణాపై శనివారం రాష్ట్ర జీఎస్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి, దాడులు జరిగేలా చేశారన్న ప్రచారం పల్నాడులో బాహాటంగా వినిపిస్తోంది. ఒకరిద్దరు కీలక నేతలకు మాత్రమే అనుకూలంగా పనిచేస్తున్న గ్రానైట్ సిండికేట్‌ను మార్చి, తమ వాటా వచ్చేవరకు అక్రమ రవాణాను అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారని సమాచారం.

### ఒక్కరోజుతోనే ఆగిన దాడులు

గ్రానైట్ అక్రమ రవాణాపై మూకుమ్మడిగా దాడులు చేసిన జీఎస్టీ అధికారులు ఒక్కరోజు ముచ్చటగానే ముగించారు. శనివారం పల్నాడు, బాపట్ల జిల్లాలతోపాటు గుంటూరు జిల్లా అధికారులను సైతం రప్పించి ఆరు బృందాలుగా ఏర్పడి దాడులుచేశారు. అది, సోమవారాలు సైతం అక్రమ గ్రానైట్ లారీలు జిల్లా మీదుగా వెళ్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాడులపై ఓ జీఎస్టీ అధికారితో మాట్లాడగా ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక ఆదేశాలు రావడంతో శనివారం చేశామని తెలిపారు.

# భరోసా రాక వలవిల

- వేట నిషేధం పూర్తయి రెండు నెలలు దాటినా దక్కని మత్స్యకార భరోసా సాయం
- రీసర్వే పేరుతో ప్రభుత్వం కాలయాపన
- కష్టాల సుడిగుండంలో గంగపుత్రులు
- గతంలో ఠంఛనుగా సాయం అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

చీరాల: 'ప్రాణాలను పణంగా పెట్టి బతుకు వేట సాగించే మత్స్యకారుల సంక్షేమం కోసం కూటమి సర్కారు మొదటి ప్రాధాన్యతనిస్తుంది. మీరు ఓట్లేసి గెలిపిస్తే మీకు అండగా నేనున్నా.. మీ సంక్షేమమే నా ధ్యేయం అంటూ చీరాల్లో జరిగిన ఎన్నికల సభలో చంద్రబాబు ఇచ్చిన హామీ'. అయితే టీడీపీ సర్కారు కొలువుదీరి ఏడు నెలలు గడుస్తున్నా మత్స్యకారులను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏరు దాటాక తెప్పను తగలపెట్టిన చందంగా చంద్రబాబు తీరుతో గంగపుత్రుల సమస్యల వలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. గంగమ్మ తల్లిని నమ్ముకొని జీవిస్తున్న మత్స్యకారులు కష్టాల సుడిలో కొట్టుమిట్టాడుతున్నారు. గంగపుత్రుల పరిస్థితి ముందుకెళితే ముప్పు.. వెనుకచూస్తే అప్పు అన్నచందాన మారింది. ఈనెలలోనే రెండుసార్లు అల్పపీడనాలు, తుఫాన్లతో పాటు, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మత్స్యకారులు అటు వేట సాగక, పూట గడవక అష్టకష్టాలు పడుతూ అప్పులు చేస్తున్నారు. మత్స్యకార భరోసాతో అయినా ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం వేట నిషేధం పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా పరిహారం నేటికి అందించలేదు. ప్రతీ ఏటా పరిహారం అందజేసే ప్రభుత్వం మళ్లీ రీ సర్వే పేరుతో భరోసా ఇస్తారో లేదో తెలియని పరిస్థితులు ఉన్నాయి.

### భృతిపై నీలి నీడలు

కూటమి ప్రభుత్వం మత్స్యకార భరోసాపై రీ సర్వే పేరుతో కాలయాపన చేస్తూ కష్టాల్లో చిక్కుకున్న గంగపుత్రులకు సాయం అందించలేదు. మత్స్యకారుల వేట నిషేధ కాలం ముగిసి రెండు నెలలు కావస్తోంది. ఇంతవరకు అందాల్సిన సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. భరోసా నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం కొత్త నిబంధనలు తెరపైకి తేవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. మత్స్యకారులకు వేట తప్ప మరో పని తెలియదు. వేట నిషేధ సమయంలో వారి కుటుంబాలను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం కొంత సాయాన్ని భృతిగా అందజేస్తుంది. కానీ ఈ ఏడాది మాత్రం భృతిపై నీలినీడలు కమ్ముకున్నాయి.



వేట లేక ఈపురుపాలెం స్ట్రయిట్ కట్‌వద్ద నిలిపిన పడవలు

### ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేట నిషేధ సమయంలో ఐదేళ్లు క్రమం తప్పకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ రూ. 10 వేలు చొప్పున చెల్లిస్తూ వచ్చింది. 2019 నుంచి 2023 వరకు ఠంఛనుగా వేట నిషేధ సాయం ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు అందించి అండగా నిలిచింది. దీంతో మత్స్యకారులు అవస్థలు పడకుండా వేట నిషేధ సమయాన్ని పూర్తి చేసుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇప్పటికీ భృతి మంజూరుపై ఎటువంటి నిర్ణయం చేయకపోవడంలో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి వస్తే రూ.10 వేల నుంచి రూ. 20 వేలు పెంచుతామన్న చంద్రబాబు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా సాయం అందజేయకపోవడంపై మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

### 12,500 మంది లబ్ధిదారులు

బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల, రేపల్లె, పర్చూరు, బాపట్ల నియోజకవర్గాల్లోనే సముద్రంలో వేట చేసే మత్స్యకారులు ఉన్నారు. మత్స్యశాఖ అధికారులు ఇప్పటివరకు సర్వేచేసిన సమాచారం మేరకు ఈ ఏడాది 12,500 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. వీరికి రూ.20 వేల చొప్పున రూ. 25 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం రీసర్వే పేరుతో లబ్ధిదారులను జాబితా నుంచి తొలగిస్తారనే అనుమానాలు మత్స్యకారుల్లో ఉన్నాయి.

### త్వరగా భరోసా అందించాలి..



తాము అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసా రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా వేట నిషేధం ముగిసి రెండు నెలలు కావస్తున్నా మమ్మల్ని పట్టించుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో రూ.10 వేలు మా బ్యాంకు ఖాతాకు జమ అయ్యేవి. ప్రస్తుతం సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారు. త్వరగా సాయం అందించాలి.

– కాశీరావు, మత్స్యకారుడు

### జగనన్న హయాంలో ఠంఛనుగా అందింది..



గత జగనన్న ప్రభుత్వంలో వేట నిషేధ సాయం అందరికీ ఠంఛన్‌గా అందించారు. కూటమి ప్రభుత్వం నేటికీ మత్స్యకార భరోసా సాయం అందించకపోవడం ఈ పథకాన్ని అసలు కొనసాగిస్తారా లేదో ? అనే అనుమానాలు ఉన్నాయి. వేట సక్రమంగా లేక అప్పులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఈ సాయం వస్తే ఉపశమనం కలుగుతుంది.

– మోజెస్, మత్స్యకారుడు

# ఎయిడెడ్ పాఠశాల ప్రభుత్వానికి అప్పగింత

- గతంలో సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభమైన కారంచేడు వైఎన్‌ఓ ఉన్నత పాఠశాల
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి 6–10 తరగతులకు ఇంగ్లిష్ మీడియం



కారంచేడు వైఎన్‌ఓ ఉన్నత పాఠశాలను ప్రభుత్వానికి అప్పగిస్తూ అంగీకార పత్రాలు అందిస్తున్న కరస్పాండెంట్ రఘుబాబు

**కారంచేడు:** కారంచేడులో గ్రామంలో పేద విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి గ్రామానికి చెందిన పెద్దలు యార్లగడ్డ వెంకన్నచౌదరి, యార్లగడ్డ రంగనాయకుల చౌదరిలు రామలక్ష్మణలుగా గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేశారు. 1956లో చల్లపల్లి రాజాగారి చేతుల మీదుగా ప్రారంభమైన పాఠశాలకు నూతన భవనాలను 1963లో నిర్మించి వాటిని సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. అప్పటి నుంచి 2022 వరకు నిర్విరామంగా అనేక మందికి విద్యాబుద్ధులు నేర్పించారు. 2022 మే 6న పాఠశాలను ప్రభుత్వానికి అప్పగించేందుకు పాఠశాల కరస్పాండెంట్ యార్లగడ్డ రఘుబాబు అప్పటి విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణకు తమ అంగీకార పత్రాన్ని సమర్పించారు. ప్రస్తుతం పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్‌గా ఉన్న లగడపాటి రాజ్యలక్ష్మి, లగడపాటి మధుసూదనరావుల అభీష్టం మేరకు పాఠశాల మరో కరస్పాండెంట్ యార్లగడ్డ రఘుబాబు చేతుల మీదుగా సోమవారం పాఠశాలను ఉన్నతాధికారులకు అప్పగించారు.

**రూ.కోట్ల విలువైన స్థలాలు, భవనాలు అప్పగింత..**


కొన్ని కోట్ల రూపాయల విలువైన ఉన్నత పాఠశాలకు సంబంధించిన స్థలాలను, భవనాలను సైతం పూర్తిగా ప్రభుత్వానికి అప్పగించామని పాఠశాల కరస్పాండెంట్ యార్లగడ్డ రఘుబాబు 'సాక్షి'కి తెలిపారు. 2025 జూన్‌లో ఈ విద్యా సంవత్సరంలో ఇక్కడ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తరగతులు ఇంగ్లిషు మీడియం ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పాఠశాలలో చదివిన అనేకమంది దేశ, విదేశాల్లో విద్య, ఉద్యోగ, వ్యవసాయ, సినీ, రాజకీయ వ్యాపార రంగాల్లో స్థిరపడిన వారు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, పాఠశాల విశ్రాంత ఉద్యోగి కన్నెగంటి నాగేశ్వరరావు తన తండ్రి కన్నెగంటి రామయ్య జ్ఞాపకార్థం పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో పర్చూరు ఉప విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ తహసీల్దారు అనిత, ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, సీహెచ్ రంగనాయకులు, తిరుమల ప్రసాద్, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి

**బాపట్ల:** బాపట్ల మండలం మూలపాలెంకు చెందిన డక్కుమళ్ళ బోడెమ్మపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేశారని రూరల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రలేచి కాలకృత్యాల కోసం బయటకురాగా ఒక వ్యక్తి వెనుక నుంచి గొంతుపట్టుకుని చంపేందుకు ప్రయత్నించాడని బోడెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే సమయానికి తన భర్త, ఇరుగుపొరుగువారు రావటంతో అగంతకుడు పారిపోయాడని పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**రేపల్లె రూరల్:** అనారోగ్య బాధలు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందినట్లు పట్టణ ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఇసుకపల్లికి చెందిన నంద్యాల రాజేంద్ర (40) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో సోమవారం ఉదయం ఇంట్లోని ఫ్యాన్ హుక్కుకు ఉరివేసుకున్నాడు. గమనించిన మృతుని భార్య శివనాగ విజయలక్ష్మి స్థానికుల సహాయంతో రాజేంద్రను కిందకు దింపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. అనారోగ్యరీత్యా ఉరిపెట్టుకున్నట్లు మృతుని భార్య శివ నాగ విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**రామాపురంలో మరో వ్యక్తి..**

**చీరాల:** ఇంట్లో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటనపై సోమవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఈపూరుపాలెం రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. రూరల్ ఎస్‌ఐ వివరాల మేరకు.. రామాపురం గ్రామంలో సీఈసీ కాలేజీ వెనుక వైపు గల ఎస్టీ కాలనీకి చెందిన కోడూరు వెంకట్రావు (34) ఇంట్లో దూలానికి దుప్పటితో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతురాలి భార్య ఇంటి పక్కన ఉన్న పొలంలో పనికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు అందజేత



**బాపట్ల:** పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణ, డి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఎన్నికలు



ప్రమాణ స్వీకారం చేస్తున్న అసోసియేషన్ నూతన కమిటీ

**రేపల్లె రూరల్:** ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా యూనిట్ నూతన కమిటీ ఎన్నికలు పట్టణంలో ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగాయి. గుంటూరు మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు పి.సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికలలో అసోసియేషన్ అధ్యక్షుడిగా రేపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్రం అధ్యాపకుడు డాక్టర్ కె.భాస్కరరావు ఎన్నికయ్యారు. సెక్రటరీగా అద్దంకి కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు డాక్టర్ వి.ప్రసాద్, ట్రెజరర్‌గా చీరాల ప్రభుత్వ మహిళా కళాశాల జువాలజీ అధ్యాపకురాలు ఎస్.అంకమ్మ, ఉపాధ్యక్షుడిగా బాపట్ల కామర్స్ అధ్యాపకుడు షేక్.అబ్దుల్‌కలాంలు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీ సభ్యులకు ఆయా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత



యోగా శిక్షణకు హాజరైన విద్యార్థులు

**నగరం:** యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుందని కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో ఈనెల 2వ తేదీ నుంచి జరుగుతున్న యోగా శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈసందర్భంగా బుచ్చియ్యచౌదరి మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు యోగా చేయడం వల్ల క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అలవడి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చిన సోమనాధ క్షేత్రం నిర్వహకులు నాగేశ్వరరెడ్డి, రత్నపాప బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ వి.వి వెంకటేశ్వరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో రెండు గ్రావెల్ లారీల పట్టివేత

జిల్లాలో కమర్షియల్ ట్యాక్స్, మైనింగ్ శాఖ జాయింట్ ఆపరేషన్

**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** జిల్లాలో అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర కమర్షియల్ ట్యాక్స్, జిల్లా మైనింగ్ శాఖ జాయింట్ ఆపరేషన్‌ను రెండురోజులుగా నిర్వహిస్తున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలను మంగళగిరిలో పట్టుకున్నారు. ఈ గ్రావెల్ విలువను అంచనా వేసి కేసు నమోదు చేసి భారీ జరిమానాలు విధించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.

### రంపచోడవరం వద్ద బాపట్ల జిల్లా వాసి మృతి

**రంపచోడవరం:** రంపచోడవరం సమీపంలోని సీతపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాపట్ల జిల్లా జొన్నగడ్డపాలెం గ్రామానికి చెందిన కాటూరు రాజేష్ (38) మృతి చెందాడు. రాజేష్ ఏజెన్సీ ప్రాంతం చూసేందుకు భార్యతో కలిసి బైక్ వచ్చాడు. భద్రాచలం నుంచి ఆదివారం మారేడుమిల్లి వచ్చి అక్కడ బస చేశారు. సోమవారం మారేడుమిల్లి నుంచి బయలుదేరి రంపచోడవరం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లి అక్కడ నుంచి సొంత గ్రామం వెళ్లేందుకు ప్రయాణమయ్యారు. ఈ ప్రయాణంలో సీతపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మలుపు వద్ద లారీ ఢీకొట్టడంతో రాజేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

**భట్టిప్రోలు:** భట్టిప్రోలు మండలం కోనేటిపురం, ఆళ్లమూడి గ్రామాలలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని సోమవారం తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జనవరి 7వ తేదీ వరకు మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న రైతుల సమస్యలను అర్జీల ద్వారా స్వీకరించి 2025 ఫిబ్రవరి 22వ తేదీ నాటికి సాధ్యమైనంత మేర సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

### సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు

**రేపల్లె రూరల్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయానికి నాలుగు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని పెన్షన్‌దారులు ఒక అర్జీ అందించగా కొల్లూరు మండలం ఈపురులంక గ్రామస్తురాలైన ఈపూరు నిర్మలాకుమారి (పేరమ్మ) తన అన్నదమ్ములకు ఇవ్వబడిన కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం రద్దు చేయాలని కోరుతూ ఒక అర్జీ అందిందన్నారు. సమస్యలు పరిశీలించి పరిష్కరించబడునన్నారు.

### హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలి

సీఐ అహ్మద్‌జానీ

**బాపట్ల:** హెల్మెట్‌లు ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సీఐ అహ్మద్‌జానీ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలల్లో విద్యార్థులకు హెల్మెట్ వాడటం వలన కలిగే ప్రయోజనాలపై సోమవారం అవగాహన కలిపించారు. హెల్మెట్ వాడకంతోపాటు అతివేగంగా కూడా వాహనాలను నడపరాదని సూచించారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల జోలికి యువత వెళ్లి, జీవితాలను నాశనం చేసుకోరాదని అన్నారు.

### మార్చురీ బాక్స్ అందజేత

**చుండూరు(వేమూరు):** మండలంలోని మోదుకూరు గ్రామానికి చెందిన ఆళ్ల శైలజ గ్రామ పంచాయతీకి మార్చురీ బాక్స్‌ను సోమవారం అందజేశారు. మోదుకూరు గ్రామానికి చెందిన ఆళ్ల శైలజ భర్త చంద్ర శేఖర్ రెడ్డి జ్ఞాపకార్థంగా సోమవారం రూ.60వేలు విలువైన మార్చురీ బాక్సును బహూకరించారు.

### ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సస్పెన్షన్

**గుంటూరు ఎడ్యుకేషన్** పాత గుంటూరు ఎల్‌బీ నగర్‌లోని నగర పాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డి.తిరుపతిరెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆయన గత కొన్నేళ్లుగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు సాంఘికశాస్త్ర సబ్జెక్టును బోధించడం లేదని అందిన ఫిర్యాదులపై ఎంఈవోతో విచారణ జరిపించిన డీఈవో రేణుక సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.

## సీఐ, వైద్యునిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలి

**నగరంపాలెం(గుంటూరు వెస్ట్):** స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం సంఘ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. పొన్నూరు న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై దౌర్జన్యం చేసిన పొన్నూరు టౌన్ పీఎస్ సీఐ రవికిరణ్, వైద్యుడు ఫిరోజ్‌ఖాన్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని, ఎస్ఐ రాజకుమార్‌పై రిజిస్టర్ అయిన కేసులో సరైన సెక్షన్లు నమోదు చేయాలని సమావేశంలో తీర్మానం చేశారు. సీఐ, ఎస్ఐ, వైద్యునిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న జిల్లాలోని అన్ని కోర్టులు బహిష్కరణ చేయాలని, ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. వైద్యునిపై చర్యలకు మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలని కూడా తీర్మానం చేశారు. సమావేశంలో బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మరెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, కార్యదర్శి అనురాధ, కోశాధికారి దాసు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు క్రాంతికుమార్, అసోసియేషన్ల అధ్యక్షులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### వృద్ధుడిపై దాడి

**మంగళగిరి:** నగదు బ్యాగ్‌తో వెళ్తున్న వృద్ధుడిపై ఇద్దరు ఆగంతకులు దాడికి తెగబడ్డారు. ఈ ఘటన నగర పరిధిలోని ఆత్మకూరులో జరిగింది. ఆత్మకూరుకు చెందిన బత్తిన వెంకటేశ్వర్లు (55) నగదు బ్యాగ్ చేతిలో పట్టుకుని నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు యువకులు దాడికి పాల్పడ్డారు. వృద్ధుడి నుంచి నగదు బ్యాగు లాక్కొనేందుకు యత్నించారు. ఆయన గొంతులో చాకుతో పొడిచి పరారయ్యారు. వెంటనే గమనించిన స్థానికులు వెంకటేశ్వర్లును ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారులు అహ్మద్ షరీఫ్ చెప్పారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని, సంగడిగుంటలోని మైనారిటీ బాలిక గురుకుల పాఠశాలను సోమవారం ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎం.ఎ షరీఫ్, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షరీఫ్ సందర్శించారు. ముందుగా మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఉర్దూ బాలురు, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయన్నారు. వాటికి సొంత భవనాలు, ఆట స్థలాలను సమకూర్చాలని కృషి చేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తులో మైనార్టీ ఐటీఐ, పాలిటెక్నిక్, రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు.

### 51,059 హెక్టార్లలో రబీ సాగు

**కొరిటెపాడు(గుంటూరు):** గుంటూరు జిల్లాలో రబీ పంటల సాధారణ సాగు 70,324 హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు 51,059 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. గత అక్టోబర్ మూడో వారం నుంచి రబీ సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో వరి సాధారణ సాగు 854 హెక్టార్లు ఉండగా 771 హెక్టార్లలో నాట్లు వేశారు. జొన్న 19,130 హెక్టార్లకు 7,781 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న 20,386 హెక్టార్లకు 14,850 హెక్టార్లలో సాగు చేశారు. కంది 54 హెక్టార్లకు 149 హెక్టార్లలో, పెసర 10,516 హెక్టార్లకు 5,177 హెక్టార్లలో, మినుము 5,833 హెక్టార్లకు 5,406 హెక్టార్లలో, మంచిశనగ 7,970 హెక్టార్లకు 6,289 హెక్టార్లలో, పొగాకు 924 హెక్టార్లకు 3,369 హెక్టార్లలో సాగు చేశారు.



# బాధితులకు న్యాయం జరిగేలా చూడండి

- జిల్లా ఏఎస్పీ టి.పి.విఠలేశ్వర్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 37 అర్జీలు



ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీలు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

**బాపట్ల:** బాధితులకు సరైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో 37అర్జీలు రాగా వాటిని సంబంధిత పోలీసు అధికారులకు పంపారు. బాధితులు ఇచ్చిన అర్జీలపై సంబంధిత పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధతీసుకుని పరిష్కారించాలని సూచించారు. అర్జీదారులకు భరోసా కల్పించేవిధంగా వ్యవహరించాలని కోరారు. ఫిర్యాదులపై వెంటనే చట్టపరిధిలో విచారణ జరిపి నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని సూచించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి, సమస్యలు ఆలకించారు. పి.జి.ఆర్.ఎస్ సెల్ ఎస్ఐ శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# తొలి ఖోఖో ప్రపంచకప్ పోస్టర్ ఆవిష్కరణ



పపంచ్ కప్ పోస్టర్ ఆవిష్కరించిన రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ గరటయ్య

**జే.పంగులూరు:** ఢిల్లీలో అట్టహాసంగా మొట్టమొదటి సారిగా ఖోఖో ప్రపంచ కప్ పోటీలు ప్రారంభం కానున్నాయని రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మయ జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ వారి ఆధ్వర్యంలో తొలి ఖోఖో ప్రపంచ కప్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బాచిన చెంచు గరటయ్య మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతో ఇప్పటికే పంగులూరులో ఎన్నోసార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రపంచకప్ పోటీలు ఢిల్లీలో జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. 2008లో నిర్వహించిన సీనియర్ నేషనల్ ఖోఖో పోటీలు గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చాయన్నారు. అర్జున అవార్డు గ్రహీత రవణారావు ఖోఖో పోటీల నిర్వహణ చూసి ఇది పంగులూరా లేక బెంగళూరా ..! అని అన్నారని గుర్తు చేశారు. ఖోఖో పోటీల వలన గ్రామీణ ప్రాంతాల్లో నివసించే యువకులకు ఎంతో ఉపయోగం అన్నారు. అనంతరం సీతారామిరెడ్డి మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఖోఖో ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో 21 దేశాల నుంచి పురుషుల జట్లు, 20 దేశాల నుంచి మహిళా జట్లు పోటీపడుతున్నాయన్నారు. మొత్తం 24 దేశాలు టోర్నమెంట్ కోసం భారత్‌కు వస్తున్నాయన్నారు. అనంతరం గ్రామంలో పంగులూరు హైస్కూల్ విద్యార్థులచే ఖోఖో ప్రపంచ్ కప్ ర్యాలీ నిర్వహించారు. చెంచు గరటయ్య పోస్టర్ ఆవిష్కరించారు. పంగులూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రమాదేవి, గ్రామ పెద్దలు వీరనారాయణ, శ్రీనివాసరెడ్డి, శ్రీను, సుబ్బారావు, వీరరాఘవయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# 'మత్స్య' ఆదాయం పెంపునకు కృషి చేయండి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

**బాపట్ల:** మత్స్య సంపద, ఆక్వా రంగం ద్వారా జిల్లా వార్షికాదాయం 12 శాతం పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. విజన్ బాపట్ల–2047 అమలు ప్రణాళికపై 12 శాఖల అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. కోస్తా తీర ప్రాంతంలో మత్స్య సంపద పెంపునకు విస్తారమైన వనరులు ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిజాంపట్నం ఓడరేవు విస్తరణ పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షించాలని, చీరాల వాడరేవు నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ప్రతిపాదనలు త్వరగా పంపాలన్నారు. 289 ఫిషింగ్ టూల్స్ జిల్లాకు మంజూరు కాగా, 15 మంది మత్స్యకారులకు పంపిణీ జరిగాయని, మిగిలినవి మత్స్యకారులకు అందించాలన్నారు. 10,050 మత్స్యకారులకు వేట నిషేధిత సమయంలో పరిహారం అందించడానికి శరవేగంగా సర్వే పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు జారీచేసి రుణ సదుపాయం కల్పించాలన్నారు. వాడరేవు నుంచి సూర్యలంక వరకు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మౌలిక వసతుల కల్పనతో తీర ప్రాంతాలు మరింతగా పర్యాటకులను ఆకర్షిస్తాయన్నారు. జిల్లాలోని 313 పరిశ్రమలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పరిశ్రమలు, అసంఘటిత రంగాలలో తనిఖీలు నిర్వహించి కార్మికులకు కనీస వేతనం అమలయ్యేలా చూడాలన్నారు. సీపీఓ శ్రీనివాస్, 12 శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆశ చూపి రూ.కోట్లు కొల్లగొట్టారు

- పెట్టుబడుల పేర్లతో మోసం చేశారు
- తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశాలోనూ బాధితులు
- సుమారు రూ.30 కోట్లకుపైగా స్వాహా చేశారని ఆరోపణ
- గుంటూరులోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల ఫిర్యాదు



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

**నగరంపాలెం(గుంటూరు వెస్ట్):** పెట్టుబడుల పేర్లతో డబ్బులు ఆశ చూపి రూ.కోట్లు కాజేసి మోసగించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద నుంచి సుమారుగా రూ.ఐదారు కోట్లకుపైగా లాగేసుకుని ముఖం చాటేశారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెదనందిపాడుకు చెందిన సంధ్యా శివపార్వతి, షేక్.హుస్సేన్‌లాల్, కాకినాడ జిల్లా జగ్గంపేట వాసి బి.క్రాంతికుమార్ దంపతులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. శివపార్వతి మాట్లాడుతూ ''మూడేళ్ల క్రితం రాజేంద్రనగర్‌కు చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో పరిచయమై గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డులో ఉంటున్న ఒకరిని పరిచయం చేసింది. ఆ వ్యక్తికి రూ.లక్ష చెల్లిస్తే, నెలకు రూ.9 వేలు చొప్పున 20 నెలల్లో రూ.1.80 లక్షలు చెల్లిస్తామని చెప్పింది. 20 మందితో గ్రూప్ చేసి లక్కీడ్రా తీసి విజేతకు రూ.90 వేలు చెల్లిస్తామని నమ్మబలికింది. దీంతో గతేడాది జూన్‌లో రూ.లక్ష ఫోన్‌పే చేశా. ఆ తర్వాత రూ.4 లక్షలు చెల్లిస్తే 80 రోజులకు ఒకసారి రూ.2.80 లక్షలు చొప్పున ఐదుసార్లుగా చెల్లిస్తామని ఆశ చూపడంతో రాజేంద్రనగర్‌కు చెందిన మహిళ సమక్షంలో రూ.8 లక్షలు చెల్లించా. మరోసారి రూ.కోటి చెల్లిస్తే కారు, 100 గ్రాముల బంగారం, కంపెనీలో ఉద్యోగమిచ్చి, నెలకు రూ.2 లక్షల జీతమని నమ్మబలికితే డ్వాక్రా మహిళలు, రోజు కూలీలు, ఆటో డ్రైవర్స్, స్నేహితులతో కలిసి మరోసారి మహిళ సమక్షంలో రూ.67 లక్షలు చెల్లించా. వారాంతపు చెల్లింపులని ఆశ పెడితే మరో రూ.2 లక్షలు చెల్లించాను. తర్వాత వెంచర్ ప్రారంభించామని క్యాష్‌బ్యాక్ ఆఫర్ ఉందని చెబితే రూ.20 లక్షలు చెల్లించా. ఫిక్స్‌డ్ డిపాజిట్లు పదినెలల్లో రెండింతలవుతాయని చెబితే మరో రూ.10 లక్షలు చెల్లించాను. మరో కంపెనీ పేరుతోనూ ఒత్తిడి చేసి మరికొంత నగదు తీసుకున్నారు. 2023 నుంచి 2024 ఫిబ్రవరి వరకు రూ.1.5 కోట్లు చెల్లించాను. అని ఆవేదన వ్యక్తం చేశారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ రూ.12 లక్షలు చెల్లిస్తే రూ.36 లక్షలు, రూ.6 లక్షలకు రూ.18 లక్షలు చెల్లిస్తామని తనను మోసంగించారని వాపోయారు. దాదాపు 2 వేల మంది నుంచి సుమారు 30 కోట్లకుపైగా వసూలు చేశారని బాధితులు చెప్పారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశాలోనూ వీరి బాధితులు ఉన్నారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

# రేపటి నుంచి డైట్‌లో జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు

**గుంటూరు ఎడ్యుకేషన్** ప్రత్తిపాడు మండలం బోయపాలెంలోని జిల్లా వృత్తి విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో ఈనెల 8న రంగోత్సవ్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని విద్యాసంస్థల్లో ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. క్విజ్, స్వాతంత్ర సమరయోధుల చిత్రలేఖనం, చేతిరాత, ఐదుగురు సభ్యులతో కూడిన రంగోలి, జానపద నృత్యం, డిజిటల్ కొలేజ్ (యూనిటీ, సమైక్యత పోస్టర్), స్లోగన్ రైటింగ్ (ఏక్ భారత్–శ్రేష్ట భారత్), రోల్ ప్లే (భారత సంస్కృతి, చరిత్రకు సంబంధించిన అంశాలు)పై పోటీలు ఉంటాయని వివరించారు. గతేడాది జరిగిన రంగోత్సవ్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు అనర్హులని, పోటీల్లో పాల్గొనే విద్యార్థులు అవసరమైన సామగ్రి వారే తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి కళా రూపానికి ఐదు నిమిషాలు సమయం ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు డైట్ అధ్యాపకులు పి.పోలేరు, డాక్టర్ కె.ప్రసాద్‌ను 97047 90917, 80192 07528 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.